క్లుప్తంగా

ఉచిత సేవలను వినియోగించుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న సివిల్ జడ్జి శ్రీభరణి

నరసన్నపేట: సబ్‌జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని నరసన్నపేట ఇన్‌చార్జి సివిల్ జడ్జి డి.శ్రీభరణి అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను ఆమె గురువారం సందర్శించి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయి, మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా.. సబ్‌జైల్లో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలతోపాటు ఇతర ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించనుందన్నారు. అవసరమైనవారు జైలు అధికారుల ద్వారా అర్జీ పెట్టుకోవాలన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఖైదీలకు సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

నరసన్నపేట: స్థానిక కలివరపుపేటలోని షిర్డీ సాయి ఆలయ 15వ వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం తిరువీధి జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల మండల అధ్యక్షుడిగా వెంకటరమణ



సంఘాన్ని ఎన్నుకున్నట్లు రెవెన్యూ సిబ్బందికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

పాతపట్నం: పాతపట్నం మండలం వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడిగా కొదూరు వీఆర్‌ఏగా పనిచేస్తున్న పనుకు వెంకరటమణను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నూతన కమిటీ ఎన్నిక గురువారం నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్‌గా నవగాన ఈశ్వరరావు, సెక్రటరీగా పి.అప్పల స్వామి, జాయింట్ సెక్రటరీగా ఆర్.సావిత్రి, కోశాధికారిగా పైల తేజమ్మను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాడెల త్రినాథరావు, సహాయ కార్యదర్శి కె.రమణమూర్తి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయి వసతులు



జొన్నవలసలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయి వసతులు కల్పిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలో జొన్నవలస, సంతకొత్తవలస, సైలాడ గ్రామాల్లో జగనన్న కాలనీలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మండల సచివాలయాల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ గొంటి అనిల్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

సారవకోట: గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి బి.కుమార రాజు అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ స్మారక శాఖా గ్రంథాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలకు ఇప్పటికే అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు పంపిణీ చేశామని, మరిన్ని పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లైబ్రేరియన్ సాయమ్మ ఉన్నారు.

గ్రామ సంఘాల బలోపేతానికి చర్యలు

సారవకోట: గ్రామాలలో స్వయం శక్తి సంఘాల బలోపేతానికి వీఓఏలు కృషి చేయాలని టెక్కలి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ శ్రీరాములు అన్నారు. స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో మండలంలోని వీఓఏలతో సంఘాల ఆర్థిక నిర్వహణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘాల ఆర్థిక పరిపుష్టి సాధించాలని, దీనికి వీఓఏలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా, పొదుపు రేటు పెరిగేలా చూడాలన్నారు. ఏపీఎం గోవిందరాజులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బూర్జ: కంట్లాంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

బూర్జ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కంట్లాం, లచ్చయ్యపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాలను సంప్రదించాలన్నారు. పథకాల కోసం ఎవరికి ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలన్నారు. మ్యానిఫెస్టోను దైవంగా భావించి అందులో హామీలను ఇప్పటికే 99 శాతం అమలు చేశారని, ఇవ్వని ఎన్నో అంశాలను సైతం పరిష్కరించారన్నారు. కంట్లాం గ్రామంలో సుమారు రూ.42 లక్షల నిధులతో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మాణం చేపట్టనున్న ఇంటింటికీ మంచినీటి కుళాయిలకు శంకుస్థాపన చేశారు. మురుగు కాలువలు నిర్మాణం చేపట్టాలని స్పీకర్‌ను గ్రామస్తులు కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని స్పీకర్ హామీ ఇచ్చారు. తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, గుమ్మడి రాంబాబు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, సింగుపురపు కోటేశ్వరరావు, జల్లు బలరాంనాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, స్థానిక సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సూరపు ఉదయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

పాతపట్నం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించే ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం సచివాలయం-3 పరిధిలోని ఇందిరమ్మకాలనీ, శివానీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించారు. ఇప్పటివరకు ఆయా కుటుంబ సభ్యులు పథకాల ద్వారా పొందిన ఆర్థిక ప్రయోజనాలను తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. రాజకీయాలతో పనిలేకుండా సంక్షేమ పథకాలను అందించే ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకాలు అమలు చేయటంతోపాటు చెప్పని ఎన్నో పనులు చేస్తున్నారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని అఖండ మెజారీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జునరావు, తాతయ్య, వైస్ ఎంపీపీ ప్రదీప్, పనుకు మోహన్, పార్టీ నాయకులు కర్రి లక్ష్మీనారాయణ, గేదెల సూర్యం, జి.అప్పన్న, కృష్ణారావు, నిరంజన్, రాజు, వరదరాజులు, శ్రీనివాసరావు, రామారావు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



పాతపట్నం: ఇందిరమ్మ కాలనీలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

నులిపురుగులను నులిమేద్దాం

- చిన్నారులు, విద్యార్థులకు అల్బెండ జోల్ మాత్రల పంపిణీ

మెరుగైన సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. డీ వార్మింగ్ డే సందర్భంగా గురువారం చిన్నారులకు అల్బెండ జోల్ మాత్రల పంపిణీ చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో విద్యార్థులతో మాత్రలు మింగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: రావివలసలో మాత్రల పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పాతపట్నం: సీతారాంపల్లి పాఠశాలలో మాత్రలు వేస్తున్న వైద్యుడు ఐ.శ్రీధర్



నరసన్నపేట: ఉర్లాం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారులు



బూర్జ: బూర్జ ప్రాథమిక పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



హిరమండలం: హిరమండలం జెడ్పీహెచ్‌ఎస్‌లో మాత్రలు వేయిస్తున్న వైద్యాధికారి సాయిగీత

యూనివర్సిటీని ఆదరించండి

- నరసన్నపేటలో సినీ హీరో ఆర్.నారాయణమూర్తి సందడి

నరసన్నపేట: సినీ హీరో ఆర్.నారాయణ మూర్తి గురువారం నరసన్నపేటకు వచ్చారు. ఆయన హీరోగా తెరకెక్కించిన యూనివర్సిటీ సినిమా ప్రచారం నిమిత్తం నరసన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జ్ఞానజ్యోతి డిగ్రీ విద్యార్థులను కలిసి సినిమా గురించి మాట్లాడారు. ఈ సినిమాను విద్యార్థులందరూ చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనతో ఫొటోలు దిగేందుకు విద్యార్థులు, అధ్యాపకులు పోటీపడ్డారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అభివాదం చేస్తున్న ఆర్.నారాయణమూర్తి

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కొత్తూరు: మెట్టూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నేతలు

పోలాకి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పోలాకి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు ఆర్.శ్రీనివాసరావు విష్కరించారు. అధ్యయనం, అధ్యాపకం, సామాజిక స్పృహ అనే లక్ష్యాలతో ఏర్పడిన యూటీఎఫ్.. ఆ దిశగా అలుపెరగని పోరాటాలు చేస్తోందని పలువురు వక్తలు అన్నారు.

కొత్తూరు: యూటీఎఫ్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు ఆర్.కొండలరావు ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, కొత్తూరు మండల శాఖ అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో విజయం సాధ్యం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే విజయం సాధించగలరని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అలిమ్-కో సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పాతపట్నం, టెక్కలి నియోజకవర్గంలో గల దివ్యాంగులు, వయోవృద్ధుల ఉపకరణాల కోసం 146 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారందరికి ఉచితంగా ఉపకరణాలను త్వరలోనే సరఫరా చేయడం జరుగుతుందని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల జిల్లా సంక్షేమశాఖ ఏడీ కవిత తెలిపారు. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జునుడు, తాతయ్య, వైస్ ఎంపీపీ ప్రదీప్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.అప్పన్న, నాయకులు పనుకు మోహన్, కామక త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: ఉపాధి హామీ కార్యాలయం వద్ద మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, డ్వామా పీడీ రాజు

నా భూమి.. నా దేశం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులకు గుర్తుగా పలు గ్రామాల్లో శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. విరివిగా మొక్కలు నాటారు. పలుచోట్ల విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతిధులు, అధికారులు, స్థానిక నాయకులు, యువత పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: పాతపట్నం శాఖా గ్రంథాలయంలో జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయా సంస్థ కార్యదర్శి కుమార్ రాజు



బూర్జ: దొంకలపర్తలో మొక్కలు నాటిన జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, నాయకులు



ఆమదాలవలస రూరల్: తొగరాంలో మొక్కలు నాటుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



సరుబుజ్జిలి: రావివలసలో దేశ నాయకుల చిత్రటాలకు నివాళులర్పిస్తున్న సర్పంచ్ వందాన కృష్ణ



మెళియాపుట్టి: పద్ద గ్రామంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

రానున్న ఎన్నికల్లో బీఎల్‌ఏల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ ఇప్పటినుంచే పనిచేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని బూత్ స్థాయి ఏజెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బీఎల్‌ఏల పాత్ర రానున్న ఎన్నికల్లో ప్రధానం కానుందన్నారు. నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలకు పార్టీ తరఫున బీఎల్‌ఏలను ఇప్పటికే నియమించామన్నారు. ఇది మొదటి సమావేశమని, తరచూ కలుసుకుని గ్రామాల్లో పరిస్థితిని సమీక్షించుకుందామన్నారు. గత ఎన్నికల్లో అందరూ ఎంతో కష్టపడి పనిచేశారని, జిల్లాలో అందరి కంటే ఎక్కువ మెజార్టీ మనకే వచ్చిందన్నారు. దీనికి మీ ఆదరణ, ప్రేమే కారణమని, అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో కూడా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ చూడాలని, ఆ లక్ష్యంతోనే అందరూ పని చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని, దీనిని ప్రజలకు వివరించి వారి మన్ననలు పొందాలన్నారు. పార్టీ ప్రధాన నాయకులు శాస్త్రి, కరిమి రాజేశ్వరరావు, ఆరంగి మురళి, లుకలాపు రవి, సాయిప్రసాద్, బైరాగినాయుడు, కణితి కృష్ణమూర్తి, వాన గోపి, నక్క తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది పనితీరుపై అసంతృప్తి

- సంతకాలు, వేలిముద్రలు లేకుండా వేతనాల చెల్లింపు..

పాతపట్నం: మండలంలోని అన్ని గ్రామం పంచాయతీల్లో ఉపాధి వేతనదారులకు సంతకాలు, వెలిముద్రలు లేకుండా వేతనాలను అందజేయడంపై ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో 2022-23 సంవత్సరానికి గాను ఉపాధి కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదిక గురువారం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్లక్ష్యం వల్లే ఇలా చేస్తున్నారని, ఇకపై ఇలాంటివి జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. సామాజిక తనిఖీల నిర్వహణలో మండల అధికారుల లోపం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీ పి.రాధ, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, శ్రావణ్‌కుమార్, ఏపీఓలు సురేష్, తెంబూరు రవి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

సారవకోట: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. తెంబూరు, హిరమండలం రోడ్డు నిర్మాణ పనులను మండలంలోని పెద్దలంబ సమీపంలో జరుగుతున్న పనులను గురువారం పరిశీలించారు. పాతపట్నం మండలం తెంబూరు నుంచి సారవకోట మండలంలోని పెద్దలంబ, బొంతు జంక్షన్ మీదుగా హిరమండలం వెళ్లేందుకు రోడ్డు విస్తర్ణ, నిర్మాణ పనులను రూ.25 కోట్లతో జరుగుతున్నాయన్నారు. 15 కిలో మీటర్ల పొడవున ఈ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈఈ పి.సత్యనారాయణ, డీఈఈ తిరుపతిరావు, ఏఈ యోగేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా వృద్ధి చెందాలి

సరుబుజ్జిలి: మహిళా సమైఖ్య సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ పీడీ డి.విద్యసాగర్ తెలిపారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో గురువారం గ్రామ సమైఖ్య సంఘాల అధ్యక్షులు, వీవో ఏలతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ మహిళా సంఘం బాగా పనిచేసి ఏ గ్రేడ్‌లో నిలవాలన్నారు. ఆర్థికలావాదేవీలు, పుస్తక నిర్వహణ, పీఎంఈజీపీలపై సభ్యులతో చర్చించారు. వైకేపీ ఏపీఎం కమలకుమారి పాండ్యన్, సీసీలు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం



సరుబుజ్జిలి: బప్పడాం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పేడాడ అరుణ

సరుబుజ్జిలి: మండలంలోని బప్పడాం పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి అభ్యర్థులుగా పేడాడ అరుణ, పేడాడ వెంకటనర్సమ్మ, బిర్లంగి దివ్య, పేడాడ భాగ్యలక్ష్మి నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి డి.బాలరాజు గురువారం తెలిపారు. తెలికిపెంట పంచాయతీ 10వ వార్డు మెంబర్‌కు వండాన అప్పలనర్సమ్మ, సోమిన చిన్నమ్మడు, సోమిన రాజేశ్వరి, కొబగాపు సత్తెమ్మ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి కంచరాన శ్రీనివాసరావు వెల్లడించారు. నామినేషన్ల కార్యక్రమంలో విజయరాంపురం సర్పంచ్ బెండి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొన్నాడ కొండలరావు, ధవళ రామారావు పాల్గొన్నారు.

8 వార్డు స్థానాలకు 20 నామినేషన్లు..

నరసన్నపేట: మండలంలో ఏడు పంచాయతీల్లో 8 వార్డు స్థానాలకు 20 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారంతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది. తెలగవలసలో 1, 8వ వార్డులకు ఎన్నిక జరుగుతుండగా.. ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు వచ్చాయి. నరసన్నపేటలో 7వ వార్డుకు ఒకటి, దూకులపాడు పంచాయతీలో 8వ వార్డుకు ఒకటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. చోడవరంలో 8వ వార్డుకు 3 నామినేషన్లు, కోమర్తిలో 3వ వార్డుకు 3 నామినేషన్లు, మడపాంలో 8వ వార్డుకు 4 నామినేషన్లు, మాకివలసలో 2వ వార్డుకు 6 నామినేషన్లు వచ్చాయని ఎంపీడీఓ బి.మధుసూదనరావు తెలిపారు. నరసన్నపేట 7వ వార్డుకు వారణాశి శివ శంకర్ నామినేషన్ వేశారు. ఈయనకు మద్దతుగా వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు హాజరయ్యారు. అలాగే తెలగవలస, దూకలపాడుల్లో వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

సారవకోట: మండలంలోని బద్రి సర్పంచ్ పదవి, ఐదు పంచాయతీలలో వార్డు సభ్యులకు జరగనున్న ఉప ఎన్నికలకు గురువారంతో నామినేషన్లు ముగిశాయి. బద్రి సర్పంచ్ పదవికి ఐదు నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు తెలిపారు. చిన్నకిట్టాలపాడులో వార్డు సభ్యులకు రెండు, గోవర్ధనపురం, లక్ష్మీపురం పంచాయతీల్లో వార్డు సభ్యులకు ఒక్కొక్క నామినేషన్ చొప్పున వచ్చినట్లు వెల్లడించారు. రామకృష్ణాపురం, కరడశింగి పంచాయతీల్లోని వార్డు సభ్యులకు నామినేషన్లు రాలేదన్నారు. ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు.

పొందూరు: మండలంలోని పొందూరు పంచాయతీలో 14వ వార్డుకు ఒకటి, గోకర్నపల్లిలో 2వ వార్డు ఉప ఎన్నికకు మూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీఓ సీపాన హరిహరరావు తెలిపారు. పొందూరులో అనకాపల్లి శివకుమార్, గోకర్నపల్లిలో చింతాడ సూర్యనారాయణ, గురుగుబెల్లి నర్సింగరావు, సీపాన వెంకటరమణ నామినేషన్లు వేశారన్నారు.